# పడిలేచిన కెరటం

## – గంటి భానుమతి



*(గత సంచిక తరువాయి)*

**నేనేం** మాట్లాడ లేదు. ప్రామిస్ కూడా చెయ్యలేదు. నా మౌనాన్ని మరో విధంగా అర్థం చేసుకున్నారు.

“ఇలారా ఇప్పుడు చేయాల్సింది మరొకటి ఉంది ” అంటూ కదిలారు,ఇద్దరూ.

వాళ్ళ మనసులో ఏం ఉందో నాకు తెలీదు. తెలిసినా నేనేం చేయలేను. వాదించలేను. గబ గబా ఓ పెద్ద కత్తెర తెచ్చి,ఒకదాని తరవాత మరోటి అన్నీ చిన్న చిన్న ముక్కలుగా చేసి, మెల్లిగా, కొంచెం కొంచెం గా అన్నీ కాల్చేసారు. ఎర్రటి మంట, ఆతరవాత నల్లటి పొగ.

అవన్నీ ముందుగా ప్లాన్ వేసుకున్నట్లుగా ఉన్నారు. అందుకే అన్నీ కూడా ఒకదాని వెనక జరిగిపోతున్నాయి.

గుండె గొంతులోకి వచ్చేస్తోంది. గుండె అంతకంతకూ బరువై పోతోంది. బద్దలైపోతుందేమో అనిపిస్తోంది. గట్టిగా ఏడ్చెస్తానేమో ననిపించింది. కానీ అలాంటిది ఏం జరగలేదు. నా కంట్లోంచి ఒక్క చుక్క కూడా రాలేదు.

నేను ఓడిపోయాను ,ఆర్ణవ్,వంశీ మొహాలు కనిపిస్తున్నాయి. పూర్తిగా ఓడిపోయాను. ఎందుకో అవమానం అనిపించి ఆ క్షణాన్నే చచ్చి పోవాలని పించింది. నేను ఏం పోగొట్టుకున్నానో, ఏం కోల్పోయానో . ఆ నల్లగా మసి అయిన కాగితం ముక్కలు,చూస్తే అర్థం అయింది. ఎందుకో నా శరీరం కూడా అలాగే మండిపోతే, మాడిపోతే, బూడిదైపోతే , నల్లగా మారిపోతే, పొగలాగా పైకెళ్ళిపోతే , వీళ్ళకి అప్పుడు బావుంటుందా?

“ ఇంక ఇప్పుడు అన్నీ సద్దుకుంటాయి. పరిస్థితి మామూలుగా అయిపోతుంది. ఇవ్వాళ నుంచి నువ్వు ఓ కొత్త మనిషివి. గతాన్ని మర్చిపో. వాటిని గుర్తు తెచ్చుకోకు. అంతే,నీ ముందున్నది ఎంసెట్,మెడిసిన్,నీ కల, మా కల,.అంతే. ఈ స్నేహాలు అవీ, ఎందుకూ పనికి రావు,వేస్ట్,పైగా ఈ చదువుకి చేటు ” అనేసి మళ్ళీ నా గదిలోకి వెళ్ళారు.

వాళ్ళన్నట్లుగా నేను అన్ని మర్చిపోతానా? ఉహూఁ, మర్చి పోలేను. నేను అంతా మర్చి పోతానని వాళ్ళు అనుకుంటున్నారు. వంశీ తో స్నేహంగా ఉన్నప్పుడూ, ఆర్ణవ్ తో స్నేహంగా ఉన్నప్పుడు , ఇష్టపడినప్పుడు నా ఆశలని, కలలని నేను మర్చి పోలేదు. కొన్ని లక్ష్యాలుండేవి. అందుకే వాటికి ఇచ్చిన ప్రాముఖ్యం ఆర్ణవ్ కి,వంశీకి ఇవ్వలేదు. అందుకే ఊరు మారినా నాలో ఏ మార్పు రాలేదు.

నేను నా జీవితంలో ఏదో చేయాలనుకున్నాను. ఆ ఉద్దేశంతో అలాంటి కలతో వచ్చాను. మెడిసిన్ లో సీటు రాకపోతే మరోసారి ఎంట్రెన్స్ రాస్తాను. వంద లోపు రాంక్ వస్తుంది. అమ్మా వాళ్ళ కోరిక కూడా నెరవేరుతుంది. నేను డాక్టర్ కావడం వాళ్ళ కల. నాక్కూడా అదే కల. ఆ కలనిమళ్ళీ మళ్ళీ కనడానికి నాకు అభ్యంతరం ఏంలేదు, అది ఒకప్పుడు.

కానీ ఇప్పుడు కాదు. ఇప్పుడు ఆ కల భయంకరంగా కనిపిస్తోంది. తలచుకోడానికే భయం వేస్తోంది. ఈ రోజున ఇంత జరిగాకా, అవి అన్నీ ఉంటాయా? ఉండవు. అవి కూడా కాలిపోయాయి. ఇప్పుడు అవేవి లేవు. వాళ్ళ కలని నిజం చేయాలని లేదు. ఇప్పుడంతా శూన్యం,అంతా ఖాళీ. ఇంటర్ లో పదో క్లాసులో ఎంసెట్ రాస్తున్నప్పుడూ  నేను కన్న కలలు ఉన్నవి అన్నీ కూడా ఎక్కడికి వెళ్ళాయో తెలీదు. ఇప్పుడు మళ్ళీ ఆ కలని కనాలని లేదు. అవి నాకక్కర్లేదు.

జరిగినదంతా ప్రతీనిమిషం కళ్ళముందు కనిపిస్తోంది. అసహనంగా ఉంది. ఏంచేయాలో తెలీడంలేదు. నిద్ర రావడం లేదు. చచ్చిపోయిన ఆర్ణవ్ మాటలూ, చూపులు, వంశీ ఉత్తరాలూ, ప్రద్యుమ్న పాటలూ, ఇవే,ఇవే . కాలిపోతున్న ఉత్తరాలు.  ఇవే  కళ్ళ ముందు తేలిపోతూ కనిపిస్తున్నాయి. తెలీని బాధ. కోపం. ఆశ్చర్యం ఎందుకో ఏడవ లేదు. ఏడుపు రాలేదు.

ఏం చేస్తే అమ్మా వాళ్ళ మీద కోపం తగ్గుతుంది. నేను చేయగలిగినది ఒక్కటే  సూసైడ్,పైన చూసాను ఫాన్ తిరుగుతోంది. చున్నీ తీసాను. ఇదే నేను చేస్తాను .  నేను,చస్తే గొడవ పోతుంది .  కానీ వెంటనే ఆ పని చెయ్యలేక పోయాను.  సూసైడ్  అంత ఈజీ కాదని తెలుసు. అది ఓసారి అనుభవం అయింది.

ఓ నాలుగు రోజులు గడిచాయి. నేను పైకి మామూలుగానే ఉన్నా లోపల మాత్రం నొప్పి, భరించలేని నొప్పి. ఈ నొప్పి ఎలా తగ్గుతుంది. నా గదిలోనే అటూ యిటూ రెస్ట్ లెస్ గా తిరిగాను. చేతికి టేబుల్ కోణం గట్టిగా తగిలింది. ఆశ్చర్యం నొప్పి అనిపించలేదు. వెంటనే నా గోళ్లతో చేతిమీద నొక్కి పెట్టాను. అలా చాలా సార్లు. ఇంకా లోపలికి గుచ్చాను. కళ్ళు మూసుకున్నాను. కొంచెం నొప్పి తగ్గినట్లనిపించింది. అమ్మ వాళ్ళ మీద   కోపం కొంచెం తగ్గింది.

మర్నాడు కూడా అలాగే టేబుల్ కోణానికి గట్టిగా  కొట్టు కున్నాను. గోళ్ళతో చేతిమీద గీరుకున్నాను. నొప్పి కొంచెం తగ్గింది. కాని పూర్తిగా తగ్గ లేదు. ఏం చెయ్యాలో తోచక అటూ ఇటూ తిరిగాను. గది అంతా వెతికాను. ఓ చిన్న కత్తి దొరికింది. దాన్ని ఎప్పుడో ఏదో పండు కోయడానికి తెచ్చి ఉంటాను. వెంటనే మళ్ళీ వంటింట్లో పెట్టలేదు. ఇప్పుడు దాన్ని నా చేతిలో పట్టుకుని ఆలోచించాను. పదును గా ఉందా లేదా అని చేతి మీద కోసుకున్నాను  . ఎర్రటి చార ,రక్తం పైకి రాలేదు కానీ చాలా పదునుగా ఉంది. మరోసారి, దాన్ని తీసుకుని మణికట్టు దగ్గర అడ్డంగా కోసాను.  రక్తం పైకొచ్చింది. మరోటి, రక్తంతో ఓ గీత,దాన్నే చూస్తూ ఉండిపోయాను.

ఇప్పుడు పర్వాలేదు, లోపలి నొప్పి కాస్త తగ్గింది. లోపలున్న కోపం కూడా తగ్గింది, ఈ కత్తి కోత వల్ల వచ్చిన ఈ పైన నొప్పి నిజం అయింది.  దీన్ని నేను ఓర్చుకోగలను. కారుతున్న రక్తం తుడవాలని దూది కోసం అంతా వెతికాను. దొరికింది. డెట్టాల్ వేసి తుడిచాను.

నేను ఏం చేసానో అమ్మా వాళ్ళకి తెలీదు. అయితే దీన్ని వాళ్లకి తెలియ కుండా చెయ్యగలను. ఒకవేళ తెలిసినా నన్నేంచేయగలరు. ఏం చేయలేరు. ఇది నా శరీరం. నా ఇష్టం,  దీని మీద అధికారం నా ఒక్కదానికే ఉంది. దీన్ని నేనేం అయినా చేసుకుంటాను, వాళ్ళకి ఏ విధమైన అధికారం లేదు. ఇది వాళ్ళు చేసిన దానికి ప్రతీకారం తీర్చుకోవడం. ఎందుకో అలిసిపోయాను. ఎదురుగా మంచం కనపడింది. దానిమీద వాలిపోయాను.కళ్ళు మూసుకున్నాను.

ఇప్పుడు నా మనసంతా ఖాళీ. శూన్యం. అందులో ఏంలేదు. నేను ఏదైనా వింటున్నానంటే  కాలి పోయిన  ఉత్తరాల్లోంచి వస్తున్న ఆక్రందనలు. నన్ను రక్షించు అన్న ఆక్రోశాలు. ఆర్ణవ్ మాటలూ, చూపులూ.అతని భయంకరమైన చావు.

అవి అన్నీ అరిచి బాధగా కాలిపోతూ మాడి మసి అయిపోయాయి. వాటిని అలాగే చూస్తూండి పోయాను.

అమ్మా వాళ్ళు అన్నారు, నువ్వు ఇప్పుడు కొత్త మనిషివి. అమ్మా,నాన్న అన్నట్లు ఆ మాట సత్యం. నిజమే నేను కొత్త మనిషినే. కానీ వాళ్ళు అనుకుంటున్నట్లుగా కాదు.

నా మనసు పని చేయడం మానేసింది. దానిలోని జీవం చచ్చిపోయింది. కారణం నాలోపలిది ఏదో చచ్చిపోయింది. అది ఏంటో నాకు తెలుసు. అది నా ఆత్మ. ఇప్పుడు ఆత్మ లేని శరీరం తో తిరుగుతున్నాను. ఇలా ఉన్న నేను చస్తే ఏం? నేను ఓవేస్ట్ అమ్మాయిని. బతికి ఉండడం దండగ యూస్లెస్ లైఫ్ ఈజ్ ఎన్ అర్లీ డెత్..

ఎంత సేపు అలా ఉన్నానో నాకే తెలీదు. ఇంత జరిగాకా నేను మరోసారి ఏమీ చెయ్యనని వాళ్ళు అనుకున్నారు . అందుకే నా మానాన నన్ను స్వేచ్ఛగా వదిలేసారు. నా గదిలోకి వాళ్ళు ఎవరూ రాలేదు. నేను ఓ కొత్త మనిషిని అని. నిజంగానే కొత్త మనిషినే. ఆత్మలేని మనిషిని. బతికీ లాభం లేదు.అమ్మా,నాన్నా ఇద్దరూ పెద్ద శతృవుల్లా కనిపిస్తున్నారు,వాళ్ళని చూసినప్పుడల్లా ఛావాలన్న కోరిక రోజు రోజుకి బలంమైపోతున్నట్లుగా అనిపిస్తోంది.

అమ్మ అన్నం తినడానికి రమ్మనమని రెండు సార్లు పిలిస్తే వెళ్ళాను. వెళ్ళక పోతే ఓ పెద్ద ఇష్యూ చేస్తారు. అన్నం తింటున్నప్పుడు ఎడమ చేతి మణికట్టుని అమ్మ చూసింది. వెంటనే అడిగింది .

“ఏంటీ ఆ ఎర్ర గాట్లు ?అలా గీరుకుపోయింది..? ” వెంటనే ఏం చెప్పాలో తెలీలేదు, ఆలోచిస్తున్నాను.

“కాలేజీలో ,.డిసెక్షన్ చేస్తూంటే ఏదైనా కోసుకుందా ? ” అని అమ్మ మళ్ళీ తనే అంది.

“అవును” అన్నట్లుగా తల ఊపాను.

“ఈ సారి నుంచి జాగ్రత్తగా ఉండు. ఇప్పుడే ఇలా అజాగ్రత్తగా ఉంటే రేపు మెడిసిన్ లో అనాటమీ వాటిల్లో ఏం చేస్తావ్? ” ఇలాంటివి ఎన్నో ఉంటాయి.

నా నోట మాట రాలేదు. అమ్మ ఎంత ముందు వెళ్ళిపోయింది? మెడిసిన్ నేను చదవడం లేదు. అంత ముచ్చటగా ఉంటే ఆ అనాటమీ, ఫిజియాలజీ ఏదో నువ్వే చదువుకో అని మనసులో అనుకున్నాను. నిశ్శబ్దంగా తినేసాను. నిద్ర పోయాను. అది కలత నిద్ర. ఆ కలతలోనే పీడ కలలు. ఏదో లోయల్లోకి జారిపోతున్నట్లుగా అనిపించి ఉలిక్కి పడి లేచాను. ఎక్కడో ఆర్ణవ్ గొంతు. నువ్వే నన్ను చంపేసావ్ అంటున్నట్లుగా వినిపిస్తోంది.లేదు నేను చంపలేదు . బామ్మ ఏడుపు, నా ఏడుపు, నిద్ర లోంచి లేచిపోతున్నాను.

దేనికో భయం, ఎందుకో తెలీదు, ఇంతకు ముందు ఇలా జరగలేదు. ఏదో ఫీలింగ్ గొంతు వరకూ వచ్చేసి, గొంతుని నొక్కేస్తోంది.నాన్న నావెనకాల నుంచుని నా గొంతుని పిసికేస్తున్నారు. చిన్నప్పుడు అమ్మ ఎప్పుడూ అనేది,ఇది ఛస్తే పీడాపోయేదిఅని అప్పుడు నిజంగా అందా! అది మొమెంటరీ రియాక్షన్ కావచ్చు.కో పంలో ఏదో అని ఉంటచ్చు. కాని ఇప్పుడు ఆ మాట అనలేదు. కానీ,నాకు నిజంగానే ఛావాలని అనిపిస్తోంది. కాని ఇప్పుడు నాన్నగొంతు నులిమేస్తున్నారు. అంటే నేను ఛస్తే వీళ్ళకి పరవాలేదా!

మళ్ళీ తెలివి వచ్చేసింది. కళ్ళు తెరిచాను. ఎందుకిలా జరుగుతోంది ? పిచ్చి ఎక్కుతుందా ? కారణం చెప్పలేను కానీ నాలో ఏదో భయంకరమైన మార్పులు జరుగుతున్నాయి. కిటికి తెరిచి బయటికి చూసాను. తెల్ల వారుతోంది. వాకింగ్ వాళ్ళు , నిశ్శబ్ధంగా వెళ్ళిపోతున్నారు. పేపరు వాళ్ళు,అరటి పళ్ళ వాళ్ళు బిజీగా వెళ్తున్నారు. పక్క వీధిలో ఉన్న గుళ్ళోంచి గంటలు విని పిస్తున్నాయి.అంటే రాత్రంతా నిద్ర పోలేదా..

అలికిడికి అమ్మ లోపలికి వచ్చింది. అమ్మలాగా అనిపించడం లేదు ఓ శత్రువు లాగా అనిస్తోంది. "లేచావా? చక్కగా మొహం కడుక్కుంటే మంచి చిక్కటి కాఫీ ఇస్తాను "

నేను వెనక్కి తిరగలేదు. అలాగే కిటికీ లోంచి చూస్తున్నాను. అమ్మ కి సమాధానం ఇవ్వలేదు. కానీ అమ్మ నా దగ్గరికి వచ్చింది. నాభుజం మీద చేయి వేసింది.

" నీ మీద మాకేం కోపం లేదు. బాధ అంతే. పిల్లలు మంచి దార్లో వెళ్ళాలనే అందరూ కోరుకుంటారు. మేమూ అంతే. మా మీద కోపం పెట్టుకోకు, నీ మంచి కోరే వాళ్ళం. మాకేం పది మంది లేరు. మాకు నువ్వొక్కదానివి. మా ఆశలన్నీ నీ మీదే ఉంటాయి. జరిగినవన్నీ మర్చిపో, అదో పీడకల. కలలన్నీ శాశ్వతంగా ఉండవు. పీడ కలలు కూడా అంతే. ఇది కూడా అంతే. అలాంటిదే. అలాంటి వాటిని గుర్తు తెచ్చుకుంటే బాధ మాత్రం మిగులుతుంది. అందుకని వాటిని గుర్తు చేసుకోకూడదు" అంటూంటే ఆమె గొంతు వణికింది. నాకు తెలుస్తోంది అమ్మ ఏడుస్తోందని.

నేను ఏడవలేదు. అమ్మఏడ్చి నన్ను బ్లాక్ మెయిల్ చేస్తోంది, ఇది అంతా ఓ నాటకం. ఈ ఇమోషన్ నిజం కాదు. దీనికి నేను లొంగ కూడదు. కానీ అమ్మని ఇప్పుడు ఎదిరించలేను. ఎదిరించి గొడవ పెట్టదలుచు కోలేదు. నాన్నగారు ఇంట్లోనే ఉన్నారు,మధ్యలో వచ్చి కలగచేసుకుంటారు. అప్పుడు మళ్ళీ అమ్మని నాన్నగారు ఏదో అంటారు. అసలు విషయం పక్కదార్లోకి వెళ్తుంది వాళ్ళిద్దరూ దెబ్బలాడుకుంటారు. అందుకే నా మూలంగా వాళ్ళ మధ్య గొడవ పెట్టుకోదల్చు కోలేదు.

నిశ్శబ్ధంగా ఉన్న నన్నుచూసింది. " పద పద. కాఫీ తాగితే కొంచెం తేరుకుంటావు. రా " ఓ రెండు సార్లు అని గదిలోంచి వెళ్ళిపోయింది.

నేను మొహం కడుకుని నా కాఫీ గ్లాసు తెచ్చుకుని , కిటికీ లోంచి బయటికి చూసాను. ఆరో అంతస్థులోని కిటికి అది. కాలేజీలకి వెళ్ళే వాళ్ళు,ఆఫీసులకి వెళ్ళే వాళ్ళు, వెళ్తున్నారు. స్కూలు పిల్లలు వాళ్ళ బస్సుకోసం ఎదురు చూస్తున్నారు వాళ్ళ పక్కనే ఆ పిల్లల సంచులు మోస్తూ పెద్దవాళ్ళు. అందరూ కబుర్లు చెప్పుకుంటున్నారు. పిల్లలు,అటూ ఇటూ తిరుగుతున్నారు. నేనూ అలాగే స్కూలుకెళ్ళాను. అలాగే బస్సుకోసం ఎదురు చూస్తూ నా తోటి పిల్లలతో ఆడుకున్నాను. అప్పుడు జీవితం గురించిన ఏం ఆశల్లేవు. జీవితం నుంచి ఏమీ ఆశించ లేదు. జీవితం అంతా ఇలాగే హాయిగా ఉటుందనుకున్నాను. ఆ వయసులో నాకేం కలల్లేవు. కానీ నా బదులు అమ్మ ఆ కలలు కనింది. ఇప్పుడు అక్కడున్న ఆ తల్లులు కూడా అంతే. ఏవే పెద్ద ఆశలు, కలలతో ఉండి ఉంటారు .ఎందుకో ఒకసారి అనిపించింది. ఈ ఆరో అంతస్థు నుంచి కిందకి దూకితే ఏమవుతుంది ? చచ్చి పోతానా. ఆ పిల్ల మధ్య పడిపోతే.

ఇలా ఊహిచుకుంటూన్న కొద్దీ భయం వేస్తోంది. భయం గుప్పెట్లో నేను. చెమట్లు పట్టెస్తున్నాయి. ఈ మధ్య రాత్రిళ్ళు నిద్ర లేకపోవడం వల్ల లోపల ఏదో లా అవుతోంది. కడుపు లోంచి ఏవో పుల్లటి రసాలు పైపైకి వచ్చెస్తున్నాయి. కిందకి మళ్ళీ చూసాను. కళ్ళు

తిరిగినట్లయింది. వాంతి వస్తున్నట్లవుతోంది. వెంటనే బాత్రూంలోకి వెళ్ళాను. కాఫీ అంతా బయటికి వచ్చేసింది. మంచం దగ్గరికి వచ్చేసాను. బాగా నీరసంగా ఉంది. కాళ్ళుపైకి పెట్టుకుని మంచం మీద కూచున్నాను.

నీకేం కాలేదు. ఏం పర్వాలేదు, అని నన్ను నేను ఓదార్చుకున్నాను. అయినా లాభం లేకపోతోంది. ఏదో అవుతోంది. నాకేం అవుతోందో తెలీడం లేదు. గడియారం వైపు చూసాను. ఇంకాస్సేపు అయితే నేను కాలేజీకి వెళ్ళడానికి తయారవాలి . కాలేజీ,పుస్తకాలు, పిల్లలు , ఏదో భయం. ఊపిరి పీల్చడానికి రావడం లేదు. ఏదో నొక్కుకు పోతోంది. చచ్చి పోతానా. చచ్చి పోతే ఏం జరుగుతుంది ,ఏం తెలీదు. పక్కన ఏం జరుగుతోందో ఏం తెలీదు. అమ్మా వాళ్లు అనేది ఏదీ వినపడదు. అమ్మ ఏడుపు వినిపించదు. అంతలో అమ్మ మాటలు వినపడ్డాయి. మామూలుగా అయిపోయాను. ఏం చేయాలో అర్థ కాక , వెంటనే వంటింట్లోకి వెళ్ళాను. అమ్మ నాన్నగారికి రెండోసారి కాఫీ తయారు చేస్తోంది. నా రాక గమనించి తల ఎగరేసింది. ఏంవిటన్నట్లుగా చూసింది. నేను వెంటనే వంట గట్టుని ఆనుకుని ఒక్కసారి గట్టిగా ఏడ్చేసాను ఎక్కిళ్ళు పెట్టేస్తున్నాను.

“ ఏంటిది.చిన్న పిల్లలా? ఎందుకంత ఏడుపూ ? ఏం జరిగింది? ” అంటూ కంగారుగా భయంగా నన్ను పట్టుకుని దగ్గరికి తీసుకుంది.

నాకే తెలీదు ఏం జరిగిందో. ఏం జరుగుతోందో, అలాంటప్పుడు ఏం జరగలేదు అని ఎలా చెప్తాను. అందుకని ఏం చెప్పలేదు. కాని “భయంగా ఉంది” అని మాత్రం అన్నాను.

“నిన్న కాలేజీలో ఏదైనా గొడవ జరిగిందా?”

తల అడ్డంగా ఊపాను.అసలు నిన్న కాలేజీలో ఏం జరిగిందో గుర్తే లేదు.

“ ఏం లేదు అంతా బాగానే ఉంది ” ఏదో తోచింది చెప్పేసాను.

ఎంత మెల్లిగా మాట్లాడుకున్నా, నాన్నగారికి కొంచెం వినపడింది. అమ్మ ఏదో అనబోతూంటే అమ్మ నాన్నని చూసి ఆపేసింది. అంతలోనే వంటింట్లోకి నాన్న వచ్చి నా పక్కన నుంచున్నారు. ఏం జరిగిందన్నట్లుగా మా ఇద్దరిని చూసారు.

అమ్మ చెప్పింది అంతా విన్నారు. వెంటనే నా వీపు మీద రాస్తూ అన్నారు.

” ఏంకాదు.అంతా మామూలుగా అయిపోతుంది ” అని అన్నారు. ఎంతో మృదువుగా. ఆ ఆప్యాయతకి ఇంకా ఏడుపొచ్చింది.

కానీ అంతా మామూలుగా అవడం లేదు. నా ఏడుపు ఇంకొంచెం ఎక్కువైంది. అమ్మ నన్ను వంటింట్లోనే ఉన్నసింక్ దగ్గరికి తీసుకెళ్లి, కుళాయి తిప్పి,చల్లటి నీళ్ళతో నా కళ్ళూ,చెంపలూ,మొహం కడిగింది. తన కొంగుతో తుడిచింది. ఆ తడి చేతులతో జుట్టుని,అటూ ఇటూ దువ్వినట్లుగా దువ్వి, పైకి తోసింది. నేను చిన్నపిల్లలా అన్నీ చేయించు కున్నాను. ఏడుపు ఆపాను.

వాళ్ళకి ఏం చెయ్యాలో తెలీలేదు. వంటింట్లోంచి నన్ను భుజం పట్టుకుని డ్రాయింగ్ రూం లోకి తీసుకొచ్చి కూచోపెట్టారు. నాన్న మంచి నీళ్లు తెచ్చి తాగించారు. ఆ తర్వాత ఆ గది లోనే అటూ ఇటూ చాలా సీరియస్ గా ఆలోచిస్తూ తిరుగుతున్నారు.

" ఇన్ని ఏళ్ళల్లో ఇలా ఎప్పుడూ అవలేదు.ఇంత గట్టిగా ఎప్పుడూ ఏడవలేదు.కొత్తగా చేరింది కదా. రాగింగ్ అదీ చేసారేమో. అది గుర్తొచ్చి " ఆగి, అన్నాకా తిరిగి అటూ ఇటూ నడవడం మొదలెట్టారు.

" కొత్త ఎందుకయింది. చేరి ఆరు నెలల పైనే అవుతుంది. కొత్తలో రాగింగ్ చేసారంది కాని, అది కూడా ఓ నాలుగు రోజులేనట, నేను అన్నీ కనుక్కున్నాను. ఇది దాని ప్రభావం కాదు"

" మరి,ఏంవై ఉంటుంది.ఈ మధ్య బొటానికల్ టూర్ వెళ్ళారు అక్కడేదైనా జరిగి ఉంటుందా? "

" లేదు, ఆ టూరుకి ఈ సంవత్సరం ఇంకా వెళ్ళలేదు. మీరంటున్నది లాస్టియర్ ది "

" ప్రాక్టికల్స్ డిసెక్షన్స్ వాటికి భయపడిందేమో చదువు అలాంటిది. కొత్త వాతావరణం, టైం పడుతుంది. అంతేనా " అని నన్ను చూసారు.

నాకేం చెప్పాలో తెలీలేదు. నిజానికి డిసెక్షన్స్ అవీ ఇంటర్ నుంచే ఉన్నాయి. అది నాన్న మర్చిపోయారు.

"అదేం అయి ఉండదు. మొన్న రెండు సార్లు పరీక్షలు పెట్టారుట, వాటిలో మార్కులు బాగానే వచ్చాయిట. ఏదో కంటెస్ట్ లో ఫస్ట్ ప్రైజ్ వచ్చిందని చెప్పింది. ఇంకేదైనా కారణం కావచ్చు. ఆ ఉత్తరాల మూలంగానా.

ఉత్తరాల మూలంగా అంటారా " నేను అక్కడ లేనట్లుగానే మాట్లాడుకుంటున్నారు . ఆ మాటలు తనలో తనే అనుకుంటూ, వెంటనే గుర్తొచ్చినట్లుగా అమ్మ నా దగ్గరికి వచ్చింది. గడ్డం పట్టుకుని మొహం ఎత్తి నా మొహంలోకి చూసింది.

" ఉత్తరాల మూలంగానా?" నా మొహంలోకి చూస్తూ అంది.

కాదన్నట్లుగా తల అడ్డంగా ఊపాను. అది నిజం కాదని నాకు తెలుసు. అవునని చెప్పలేను. నా ఈ పరిస్థితికి మీరే కారణం , మీ మూలంగానే నాకు పిచ్చి పట్టేట్లుంది అని అనలేను.

"ఉత్తరాల మూలంగానే అని నాకనిపిస్తోంది '' అని నాన్నతో అని, నావైపు తిరిగింది.

"అలా కాల్చినందుకేనా. దానికి భయపడాల్సిందేం లేదు. ఒకవేళ కాల్చామే అనుకో,మేము మంచి పనే చేసాం. ఈ పరాయి మొగవాళ్ళ ఉత్తరాలకి నీ జీవితంతో పని లేదు. జీవితంలో వాటికి చోటు లేదు. అలాంటివి ముందు ముందు నీ వివాహ బంధాన్ని విచ్ఛిన్నం చేస్తాయి. ఈ ఉత్తరాల మూలంగా సంసారాల్లో ఎన్నో జరగకూడనివి జరిగాయి. ఇలాంటివి ఎన్నో విన్నాం. చూసాం,సినిమాలూ, టీవీలో కథలూ. అందుకే,నీకు అలా జరగకూడదు. మేము ఏం చేసినా నీ మంచికే అని నువ్వనుక్కోవాలి "

అమ్మఏదో అంటోంది. వినపడడంలేదు,పెదవులు కదులుతున్నాయి. నాకేం చెప్పాలో తెలియలేదు. ఎందుకో చేతులు చల్లపడిపోతున్నాయి. గది అంతా చిన్నగా అయిపోయింది. ఎవరో గొంతు ని నొక్కెస్తున్నట్లుగా ఉంది. ఊపిరి అందడం లేదు.ఎక్కడికో ,ఏదో లోయల్లోకి వెళ్లిపోతున్నట్లుగా అనిపిస్తోంది. నాలుగువైపుల నుంచి నొక్కెస్తున్నట్లాగా ఉంది. అక్కడే ఉన్న అమ్మా నాన్న మాట్లాడుకుంటూనే ఉన్నారు. కానీ నేను విన దల్చుకోలేదు. ఎక్కడినుంచో అమ్మ మాటలు వినపడుతున్నాయి.

" ఎలా ఉంది? ఇప్పుడు పరవాలేదా?" నేనేం జవాబు ఇవ్వలేదు. ఇవ్వాలనిపించలేదు.

అమ్మ తల మీద చేయి వేసి నిమురుతోంది. నాన్న నా వీపు మీద రాస్తున్నారు.

“ ఏం భయం లేదు. నీకు మేం ఉన్నాం. నీకేం కాలేదు. నువ్వు మామూలుగా అయిపోతావు కాస్సేపు కళ్ళు మూసుకుని దేవుడిని తల్చుకో ” నాన్న నా దగ్గరికొచ్చి నుంచున్నారు. నన్ను మెల్లిగా కూచోపెట్టారు.

నాన్న అన్నట్లుగానే కళ్ళు మూసుకున్నాను . కాస్సేపు అయ్యాకా కళ్లు తెరిచాను. నిజంగానే భయం కాస్త తగ్గినట్లనిపించింది. కొంచెం పరవాలేదు. అమ్మా నాన్న ఆందోళనగా, ఆతృతగా చూస్తూ కనిపించారు. “ఏం జరిగింది ? రేపేమైనా పరీక్ష ఉందా? బాగా చదవలేదేమో కదా అవునా ? ”

పరీక్ష ఏమీ లేదు అన్నట్టు తలని అడ్డంగా ఊపాను. వాళ్ళ మాటలకి నేనేం మాట్లాడ లేదు. కానీ నాకు ఎందుకిలా అవుతోంది.! దేనికి భయ పడుతున్నాను.!

“ ఏదో యాంక్సైటీ.అంతే ఇంకేం లేదు.అంతకు మించి ఏంలేదు. రేపటికి అంతా మామూలై పోయి సద్దుకుంటుంది. ఇవాళ కాలేజీకి వెళ్ళక్కర్లేదు ” అనేసారు. వాళ్ళు అనకపోయినా నేను వెళ్ళ దలుచుకోలేదు. ఇల్లు కదలాలని లేదు. గదిలోనే ఒంటరిగానే బావుంది. అందుకే ఆరోజంతా గదిలోనే బయటికి రాకుండా గడిపాను.

మర్నాడు క్లాసులున్నాయి. ప్రాక్టికల్స్ ఉన్నాయి. ఇంట్లో వాళ్ళు వెళ్తావా అని అడగలేదు. నేను కూడా వెళ్తానని అనలేదు.

“ ఈ రోజు విశ్రాంతి తీసుకో. అంతా బాగా అయిపోతుంది. రేపు కాలేజీకి వెళ్ళచ్చులే ”అని అన్నారు.

ఆ రోజంతా నా గదిలోనే గడిపాను.మంచం మీదే పడుకున్నాను. చదవాలని కూడా అనిపించలేదు. కవితలు రాయాలనిపించలేదు. నోట్స్ రాసుకోవాలి . జువాలజీ రికార్డ్ సబ్మిట్ చేయమన్నారు. అది చేసుకోవాలి. కానీ అది కూడా రాయాలనిపించ లేదు. ఇవన్నీ ఇదివరకూ కూడా చేసాను. అప్పుడున్న ఉత్సాహం ఇప్పుడు లేదు.

ఆ మర్నాడు కూడా వెళ్ళలేదు. అమ్మ గదిలోకి వచ్చింది కానీ ఏమీ అడగలేదు. నేనుకూడా చూసీ చూడనట్లుగా కళ్ళు మూసుకుని ఉన్నాను. దగ్గరగా వచ్చి నా నుదుటి మీద చేయవేసి చూసింది.సరిగ్గా అదే సమయానికి ఫోన్ వచ్చింది. అమ్మ ఫోను అందుకోడానికి వెళ్ళింది.

“హలో” అంటూ తీసింది. అవతల నున్నది ఎవరో కానీ అమ్మ కొంచెం గట్టిగా సమాధానం ఇస్తోంది

” శృతికి కొంచెం బాగా లేదు. ఫోను వరకూ కూడా రాలేదు . అందుకని మాట్లాడదు. కాలేజీకి వచ్చినప్పుడు మాట్లాడుతుంది ” అంటూ టక్కున పెట్టేసింది. తను ఏం మాట్లాడిందో నాకు వినపడింది. అయినా ఆ సంగతి అమ్మ నాతో చెప్పింది. అమ్మ జవాబిచ్చిన తీరుని బట్టి, ఆ ఫోను ప్రద్యుమ్న దగ్గరి నుంచి అయి ఉంటుంది నేను ఎందుకు రావడం లేదో కనుకుందామని ప్రద్యుమ్న ఫోన్ చేసి ఉంటాడు.

నేను డిగ్రీలోకి వచ్చాను, ఐనా నాకు స్కూల్లో పెట్టిన పాత రూల్స్ ఇప్పటికీ వర్తిస్తాయి. అప్పుడూ అంతే, నాకెవరైనా ఫోన్ చేస్తే మొగపిల్లలైతే, మాట్లాడనిచ్చేదీ కాదు. ఇప్పుడూ అంతే.

రేపు కాలేజీకి వెళ్ళినప్పుడు ప్రద్యుమ్న కనిపిస్తాడు. అడుగుతాడు. నేను సంజాయిషి ఇచ్చుకోవాలి. నేను ఇంట్లో ఎందుకున్నానో చెప్పాలి. ఏం చెప్ప గలను ? ఎలాంటి సంజాయిషీ ఇచ్చుకోగలను? ***( కొనసాగింపు వచ్చేనెలలో)***